కథానిక

# సమయోచిత చికిత్స

ఎస్. యం. సుభాని

సమతలమైన ఒక ఉన్నత ప్రదేశంలో కట్టబడి ఉన్నది శానిటోరియం. వాతావరణంలో ఒక ప్రత్యేక విశిష్టత ఉండటమేగాక చుట్టుప్రక్కల ప్రకృతికూడా చాల అందంగా ఉంటుంది. శానిటోరియం నిండా వేపచెట్లు నేరేడుచెట్లు ఉన్నై. అక్కడక్కడ కొన్ని చింతచెట్లుకూడ ఉన్నై. పెద్దచెట్లుగాక వార్డులచుట్టుపట్ల పది, పదిహే నడుగుల ఎత్తున రకరకాల చెట్లున్నవి. చల్లటిగాలి మందంగా వీస్తూ శరీరాన్ని తాకుతుంటే ఒక విధమైన మత్తుగా ఉంటుంది. ఎటుచూసినా పచ్చిక బయలు విస్తృతంగా వ్యాపించిఉన్నది. ప్రతిదినం ఉదయం, సాయంకాలం, పైపుతో నీళ్లు జల్లుతుండటంవలన పచ్చిక నిత్యం పచ్చగ నిగనిగలాడుతు కన్నులపండువుగా ఉంటుంది. ఇటువంటి రమణీయ ప్రదేశంలో ఉంటున్నా, చాల కాలంనుండి ఉండటంవలన మధుకి విసుగు కలిగింది.

వ్యాధి క్రానిక్ అవటంవలన మధు చాల కాలంనుండి శానిటోరియంలో ఉండున్నాడు. ఒకటి రెండుకాదు, దాదాపు మూడుసంవత్సరాలు గడచినై! ఇంతకాలం ఉన్నప్పటికి ఇంకా నయం కాలేదు. జీవితం నీరసంగా కన్పిస్తున్నది. యవ్వన ప్రథమదశలో చాలకాలం గడచిపోయింది. ఇంకా ఎంతకాలం గడపాలో తెలియదు...ఏపనీ సరిగా చేయలేక పోతున్నాడు. ఎక్కడికైనా దూరం చాలదూరం వెళ్ళిపోవాలనే భావం ఏర్పడింది.

ఆమర్నాడు మధు డాక్టరును కల్సుకొన్నాడు. కొంతకాలం నుండి అతనిలో ఏర్పడిన మార్పును చూస్తూనే ఉన్నాడు డాక్టరు...మధును చిరునవ్వుతో ఆహ్వానించి కూర్చోబెట్టాడు.

"ఏమిటిసంగతి?"మందహాసంచేస్తూ డాక్టర్.

"ఇంటి కెళ్ళాలనుకుంటున్నాను డాక్టర్..." అన్నాడు మధు, ఒక క్షణం ఆలోచించి.

మధు ముఖంలో అతని మనోభావాలు స్పష్టంగా ప్రతిఫలిస్తున్నై. అన్ని తెలుసుకొనికూడ ఏమీ తెలియనట్లు అలాగే నవ్వుతూ కూర్చొన్నాడు డాక్టర్.

"ఎన్నాళ్ళ శలవుకావాలి?" అని అడిగాడు డాక్టరు.

"శలవక్కర్లేదు...మళ్లీరాను..." అన్నాడు మధు, కొంచెం ఉదాసీనంగా.

"సరే...కాని ఒకనెల ఆగు, ఈలోగా కొన్ని టెస్ట్సు ఉన్నవి, అవి చేసిన తర్వాత వెళ్దువుగాని."

మధుకు కొంచెం ఆశ్చర్యమనిపించింది. వెళ్తాననగానే వెళ్ళమని చెప్పటం వలన మనసుకుకొంచెం కష్టంకూడ కలిగింది. బహుశా డాక్టరుకుకూడ విసుగు కలిగిందేమో ననుకొని వార్డుకు వెళ్ళాడు.

డాక్టర్ కు మధు అనుకొన్నట్లు విసుగు కలగలేదు. కాని అతని స్థితికి కొంచెం విచారించాడు. దీర్ఘకాలం వ్యాధివలన బాధపడుతూ జీవితం గడపటం ఎంత క్లిష్టమో డాక్టరుకు తెలియనిది కాదు. ముఖ్యంగా జీవితంలో మార్పు ఉండాలి. ఈ మార్పు మనుష్యుల అభిరుచి కనుగుణంగా ఉండి విసుగును పోగొట్టేదిగా ఉంటే మంచిదనుకున్నాడు. మధుమీద కలిగిన జాలి వలన అతని మనసుకు కొంత ఆహ్లాదాన్ని కలిగించాలనుకున్నాడు.

మధుమాత్రం ఎలాగైనా ఈ నెలరోజులు గడిపి కొంపకు జేరుకోవాలనుకున్నాడు. ఆ తరువాత ఏం జరుగుతుంతనే విషయం అతనాలోచించదల్చుకోలేదు. వీలైనంత సంతోషంగా కాలం గడిపివేయటం ముఖ్యం. ఈ భావనతోనే ఈ నెలరోజులిక్కడ గడిపేయాలనుకున్నాడు.

అలాగె నాలుగు రోజులు గడచినై. అయిదో రోజు డ్యూటీకొక క్రొత్త నర్సు వచ్చిందా రౌండుకు. నవ్వుతూ అతని టెంపరేచర్ అడిగింది. సామాన్యంగా ఆడవాళ్ళంటే కొంచెం సంకోచంగా ఉండే మధు ఈ కొత్త నర్సునుచూసి కొంచెం

తడబడ్డాడు. ఆ తడబాటులో తలదువ్వుకుంటూ లాకర్ మీదుంచిన అద్దం కాస్తా క్రిందపడ వేశాడు.

"అయ్యో, రూపాయిముప్పావులా అద్దం పగల గొట్టారు...ఏం మనుష్యులండీ..." అన్నది చను వుగా మందలిస్తున్నట్లు.

"ఆఁ...అబ్బె...ఫర్వాలేదులెండి." అంటూ పగిలినముక్కలు ఏరేందుకు కూర్చున్నాడు.

"మీరూరుకోండి, నే నేరుతా...మీరయితే ఎన్ని చేతుల్లో గుచ్చుకుంటారో!" అంటూ ఆమె అతని ప్రక్కన కూర్చున్నది.

"అబ్..."అంటూ లేచాడు మధు. ఏదో చిన్న పడినట్లనిపించిం దతనికి.

ఆమె జాగ్రతగా అన్ని ముక్కలు ఏరి న్యూస్ పేపర్లోవేసి పొట్లంకట్టింది.

"ఇంకా అక్కడకూడా సన్నటి ముక్కలుంటై. ఊడ్చేస్తే బాగుంటుంది...మీ పనిమనిషెక్కడ?"

"పనిమనిషా? అవును...కాని రాలేదే,ఎలా?"

"అదికూడ నాచేత చేయించాలనుకోన్నారా, ఎలా అంటున్నారు. వచ్చింతర్వాత ఊడ్చేస్తుంది లెండి. మీకు స్లిప్పర్లున్నవిగా, ఫర్వాలేదు. ఇంకా కిందవార్డుల్లో టెంపరేచర్ మార్కు చేయాలి... ముందు కొంచెం నీళ్లుపోయండి"అన్నదామె స్టాండు లోని సబ్బు తీసుకొంటూ.

ఆమె చేతులు కడుక్కుంటుంటె మధు నీళ్ళు పోశాడు. మధుకు అదొకమాదిరిగా అనిపించింది. ఆమె శరీరంనుండి అతని నాసికకు సోకిన మైసూరు శాండల్ వాసన అతని మనసును అస్థిరపర్చింది. అతను పేషంటని సంకోచపడకుండా ఆమె అతని టవల్ పుచ్చుకొని చేతులుతుడుచుకుని వెళ్లింది.

ఆమెను చూస్తు అలాగే నిల్చున్న మధు మన సులో రకరకాల తలంపులు అస్పష్టంగా కలిగినై! ఆమె అందంగానే ఉన్నది. చామన ఛాయ అయినా ముఖాన కళాకాంతులున్నై. అన్నిటి కన్నా ఆమెలోని పరిశుభ్రత, ఆమెలోని చురుకు దనం ఆకర్షణీయంగా కన్పించినై.

ఆరోజు మామూలుగా రెండుసార్లొచ్చిందామె టెంపరేచర్ మార్కుచేసేందుకు. మధు అలాగే కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నాడు.

"ఏమిటలా చూస్తారు, నేనేమైనా వింత మృగాన్ననుకున్నారా ఏమిటి?"

"ఛత్..." అన్నాడు మధు, ఏమనాలో తోచక. సిగ్గుతో అతనిముఖం ఎర్రబారింది.

"అదేమిటి, ఆడపిల్లలా అలా సిగ్గుపడతారేం" ఎగతాళిగా అడిగిందామె.

"అబ్బా, ఏమిటి మీరు..."విసుగు, విసుగుతో బాటు కోపంకూడ కలిగిందతనికి. లేచి లోనికెళ్ళి పోయాడు.

ఆమెను ఆ రౌండ్‌కు కొన్నాళ్ళవరకు డ్యూటీ వేశారు. మర్నాడు ఆమె మళ్ళా వచ్చింది. టెంపరేచర్ అడిగితే ముభావంగా సమాధానం చెప్పాడు. రెండు క్షణాలు అలాగే అతనివైపు చూసి ఆమె వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయిన తరువాత ఆమె పోతున్నవైపు చూస్తు కూర్చు న్నాడు మధు.

ఆదినమంతా ముభావంగా గడచింది. ఆ తరువాతరోజు ఆమె టెంపరేచర్ మార్కు చేసేందుకువస్తే మధు పడుకొని ఉన్నాడు. మొఖం కడుక్కోలేదు, తలదువ్వకోలేదు, ఏదో ఆలో చిస్తూ పడి ఉన్నాడు.

"ఏం పడుకొని ఉన్నారింకా? ఒంట్లో బాగా లేదా?" అని అడిగిందామె.

"దినదినగండంగా బ్రతికే దీర్ఘకాల రోగికి ఒంట్లో బాగుండేదేమిటి, బాగుండనిదేమిటి?" అతని మాటలతీరు అస్వాభావికంగా ఉన్నది.

"మీకింకా కోపం తగ్గలేదన్నమాట! అయినా ఎందుకంతకోపం, ఏమన్నానని?"

"నాలుగురోజులుండి వెళ్ళేవాడికి నాకు కోప మేమిటి, ఏమీలేదు..."

"ఏమిటి, వెళ్ళిపోతారా!" ఆశ్చర్యంగా అడి గిందామె.

"ఈ నెలాఖరుకు వెళ్ళిపోతాను."

"ఎందుకని..."

"ఎందుకని ఏమిటి? ఏదో అడగబోయారు, ఏమిటి?"

"ఏమీలేదులెండి!" కొంచెం విచార సూచ కంగా అన్నదామె.

"అదొక చెడ్డఅలవాటు...అడిగేదేదో సరిగా అడగరాదూ కొంచెం." అన్నాడతను.

అడిగినంత మాత్రాన ప్రయోజనమేమిటి? మీరేమైనా చెస్తారా పెట్టారా!" ఉదాసీనంగా, దిగులుగా అన్నది.

"అవును ..మీరలా చేస్తారో అలాగే ఊహిస్తారు. మీ తప్పేంలేదు ... అడగదల్చుకొన్నదేదో చెప్పమంటే చెప్పరు. పైగా మీరు చెప్తారా పెట్టారా అంటారు. బాగున్నది."

ఆమె కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా ఏంమాట్లాడకుండా టెంపరేచర్ పుస్తకం చూస్తు నిలబడింది. మధు ఆమె వైపే చూస్తున్నాడు.

"డాక్టరేమన్నాడు, వెళ్ళమన్నాడా?" ఆమె స్వరం ఎంతో శాంతంగా ఉన్నది, కాని వ్యాకులత స్పష్టంగా కన్పిస్తున్నది.

"నేను వెళ్ళదల్చుకొన్నప్పుడు డాక్టరనేదేమిటి ఏమైనా పట్టి ఉంచుతాడా?"

"అవును. వెళ్ళేవాళ్ళను ఎవరూ ఆపలేరు. వెళ్ళండి." కంపితస్వరంతో అంటూ ఆమె చకచకా వెళ్ళిపోయింది.

ఆమె మాత్రం రోజూ డ్యూటీకి వస్తూనే ఉన్నది, ఏదో దిగులుగా, బాధపడ్తున్నట్లున్నది. ఆమె ముఖాన విచార రేఖలు స్పష్టంగా కన్పిస్తున్నవి. అతనికేం అర్థంకావటంలేదు. ఆమె అలా ఉండటం కాదామె. ఉదాసీనంగా ఉంటున్నది.

ఆ తర్వాత ఒకరోజు ఆమె డ్యూటీకిరాలేదు. ఒంట్లో బాగుండక శలవుపెట్టినట్లు తెలిసిందతనికి. మనసుకు చాలబాధ కలిగింది. ఆమెరాక కోసం ఎదురుచూస్తూగడిపాడు. అనుకోకుండానే ఆమె కొరకు బాధపడ సాగాడు.

ఆ మరుసటి దినం ఆమె వచ్చింది. ముఖం పాలిపోయి ఉన్నది. మనిషి కొంచెం నీరసంగా కన్పించింది. ముఖాన విషాదం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతున్నది.

"ఒంట్లో ఎలా ఉన్నది?" ఆమె రాగానే అడిగాడతను.

"టెంపరేచర్ చెప్పండి..."అన్నదామె, అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

"నేనడిగిన ప్రశ్నకు ఇదేనా సమాధానం?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఛార్టులోని కాగితాలు తిప్పుతూ నిల్చున్నది.

"మారిన్..." అని పిల్చాడతను మృదువుగా.

ఆమె తలెత్తి అతనివైపు చూసింది. అతనలా చనువుగా పిలవటంవలనే గాక అతని కంఠస్వరం కూడా ఆమెను చకితపర్చింది.

"క్షమించాలి. పేరుపెట్టి పిలిస్తే ఏమైనా అభ్యంతరమా?" బాధగామందహాసం చేస్తూ అడిగాడు మధు.

ఆమె తల వంచుకొని, ఒక్కసారి అడ్డంగా తిప్పి అభ్యంతరం ఏమీ లేదని తెలియజేసింది.

"మొన్న నా మాటలవలన కష్టం ఏమైనా కలిగిందా మారిన్? నాబోటి వాని మాటలకు లక్ష్యపెట్టకూడదు...నీవన్నది నిజమే. పోయే వాళ్ళను ఆపేవాళ్ళుండరు. కనీసన నా విషయంలో ఎవరూలేరు... నేను నిన్ను కష్టపెట్టాలని అలా అనలేదు మారిన్" మాటలు బాధనుచాటుతున్నై.

ఆమె ఆశ్చర్యపోతు అతనివైపు చూస్తున్నది. లజ్జ సంకోచాలతో ముడుచుకపోయె మధు అలా మాట్లాడటం ఆమెను చాల ఆశ్చర్యపర్చింది. అతని మాటల్లో ప్రౌఢత్వం వ్యక్తమవుతున్నది. మాట్లాడక మొదలుపెట్టె మధులాంటి వాళ్ళంతా నిస్సంకోచంగా ప్రౌఢంగా మాట్లాడ్తారేమో ననిపించింది.

"మీరు కావాలని నన్ను కష్టపెట్టారని మీ మాటలవలన నాకు కష్టం ఏమీ కలుగలేదు. మీరు బాధపడకండి." అన్నదామె శాంతంగా.

"నేను బాధపడ్తున్నానన్న సంగతి తెలిసి ఉండటం మంచిదె! నా మాటలవలన గాకపోతే మరి దేనివలన కష్టంకలిగిందో చెప్పు మారిన్."

"తెలుసుకొని ఏం చేస్తారు? ఏ విషయంవలన ఇతరులు బాధపడ్తారో ఎప్పుడూ కనిపెట్టి ఉండటం కష్టం కొన్ని అనుబంధాలు విచిత్రంగా ఉంటై. ఒకరి కష్టాలకు ఇంకొకరి హృదయం క్షోభిస్తుంది. ఇలా జరగటం ఎంత అసాధారణమో దీనిని కనిపెట్టటం కూడ అంతే కష్టం."

"అలా గ్రహించలేని మూఢులు నాబోటి వాళ్ళు కొంతమంది ఉంటారు మారిన్. అటువంటి వాళ్ళ విషయంలో కొంచెం సానుభూతితో వ్యవహరించటం మంచిది."

"కాని మిమ్మల్ని మీరు కించపర్చుకోవటం అంత మంచిది కాదు...సానుభూతి చూపిస్తారు.

కాని దానివలనకూడా ప్రయోజనం లేకపోతే వాళ్ళేం చేస్తారు?"

మధు కొన్ని క్షణాలు మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆమె అతనివైపు చూసింది.

"మాబోటి వాళ్ళ బ్రతుకింతే మారిన్. తాము బాధపడేదిగాక ఇతరులనుకూడ బాధపెట్టారు. మా భావాలు, మా మాటలు చూసి కొంతమంది మమ్మల్ని సెంటిమెంటలిస్టు లనుకుంటారు. కాని మాబోటి వాళ్ళంతా చాలవరకు పెస్సిమిస్టులు. పరిస్థితులు వాళ్ళనలా తయారుచేస్తవి... నా విషయమే చూడు మారిన్. నేను బ్రతికి బాగుపడాలని కోరినవారు ఆశించినవారు ఎవరూలేరు. నిజంగా నీకు జబ్బుచేసింది కాబట్టి చికిత్సకొరకు యిక్కడికి పంపటం విద్యుక్త ధర్మంగా భావించాడు మా నాన్న. ఒక్కొక్కప్పుడు ఆలోచిస్తే ఇదంతా దివాళాకోరు వ్యాపారంగా కన్పిస్తుంటుంది." ఏదో అర్థంకాని ఆవేదన యిమిడిఉన్నదా మాటల్లో.

మారిన్ ఏమీమాట్లాడలేదు. ఆమె కళ్ళవెంట నీళ్ళుకారుతున్నై. కొన్ని చుక్కలు ఆమెముందున్న ఛార్టు పుస్తకంపైన 'టప్, టప్'మంటూ రాలినై.

"చెప్పు మారిన్, నన్నేం చేయమంటావో చెప్పు. ఎవరైనా పథ నిర్దేశకులుంటె వాళ్ళచెయ్యి పట్టుకొని కళ్ళుమూసుకొని ముందుకు సాగాలని ఉన్నది. కాని అటువంటి అదృష్టం సామాన్యంగా మాబోటి వాళ్ళకు లభించదు. స్వీకరించాల్సిందే కాని ఇచ్చేందుకు మా దగ్గరేం ఉండదు." సూటిగా హృదయాన్ని స్పర్శించి స్పందింప జేస్తున్నై ఆ మాటలు.

"మీరు వ్యాధి నయంకానిదే ఎందుకు వెళ్ళాలనుకుంటున్నారు?"

"ఏంచెప్పేది? జీవితంలో కొంత మార్పుంటే గాని బ్రతకటం కష్టమనిపిస్తున్నది. క్షణమొక యుగంగా ఉంటుందొక్కొక్కప్పుడు. ఈవిధంగా బ్రతుకు భారాన్ని సహించటం కష్టం మారిన్."

"ఈ వ్యాధితో బయటికెళ్ళి నలుగురిలో సంచరించటం యింకా కష్టం. మీరు ఇన్నాళ్ళనుండి పొందిన స్వస్థత కొన్నాళ్ళలోనే వృథా అవుతుంది. ఇంకా కొన్నాళ్లుంటే పూర్తిగ నయమవుతుంది... చెప్పండి వెళ్ళరుకదా!" ప్రార్థేయ పూర్వకంగా ఉన్న ఆమె స్వరం జాలిగొలుపుతున్నది.

"సరే మారిన్... ఈ నాటివరకు నాకొరకు నేను బ్రతికేందుకు ప్రయత్నించాను. ఈ ప్రయత్నంలో నిరాశ నిస్పృహ లెక్కువయినై. వాటి నుండి ఏదో ఒక విధంగా పలాయనం చిత్తగించాలను కుంటుండగా ఈ అలంబన దొరికింది. సంపూర్ణ విశ్వాసంతో దీనిని స్వీకరిస్తున్నాను మారిన్."

అతని మాటలకు ఆమె అమితంగా సంతోషించింది. ఏదో అనిర్వచనీయమైన ఆనందానుభూతితో వాళ్ళిద్దరి ముఖాలు ప్రకాసిస్తున్నవి. అంతవరకు అల్లకల్లోలంగా ఉన్న ఒక మహాప్రవాహంలోకి అతని జీవిత నౌక కొట్టుక పోతున్నట్లనిపించింది. ఎక్కడ ఏ సుడిగుండంలో మునిగిపోతుందోనని వ్యాకులపాటుతో ఎదురు చూస్తుండేవాడు. అలా చూస్తు చూస్తుండగానే అతని జీవిత నౌకకొక చుక్కాని లభించింది. అతను మహాప్రవాహమనుకొన్నది ఒక రస స్రవంతిగా మారింది. ఎటువంటి కల్లోలంలేక ప్రశాంతంగాఉన్న ఆ స్రవంతిలో అతని జీవితనౌక తేలియాడుతున్నట్లు అన్పించింది.

ఆమె ఒకటిన్నర మాసాలు ఆ రౌండ్‌లో ఉన్నది. తరువాత ఆమెను ఇంకొక రౌండ్‌కు డ్యూటీ వేశారు. నెలతర్వాత నెలగా కాలం గడుస్తున్నది. దానితోపాటు మధు ఆరోగ్యంకూడ క్రమంగా వృద్ధిపొందుతున్నది. ఇంటికి వెళ్తానని మధు అడగనూలేదు డాక్టర్ స్వయంగా ప్రశ్నించనూలేదు.

డాక్టరు దేనినైతే నటనగా భావించి, అలా చేసేందుకు నిర్దేశించాడో అది యదార్థంగా పరిణమించింది. ఈ పరిణామానికొక బాహ్య రూపం జీవితమంతా ఒక నటనే కాబట్టి మానవుడెప్పుడూ పరిస్థితులకు తగినట్లు నటిస్తూనే ఉంటాడు. ఒక్కొక్కప్పుడు తెలిసి నటిస్తాడు. ఎల్లప్పుడు యదార్థమైన నటనే సవ్యమైన ఫలితాల నిస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించిన మారిన్, అది ప్రసాదించిన అమూల్య సంపదతోబాటు దానినికూడా తన మనసులో భద్రపరచుకొన్నది. ★